క్లుప్తంగా

30.2 మి.మీ వర్షపాతం
కొల్లాపూర్: రెండు రోజుల నుంచి పట్టణంలో విస్తారంగా వర్షం కురుస్తోంది. మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు 30.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

మంత్రిని కలిసిన కౌన్సిలర్
కల్వకుర్తి: రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను బుధవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో కౌన్సిలర్ కిశోర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరారు. శేఖర్ రెడ్డి, సురేందర్‌రెడ్డిలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు
కల్వకుర్తిరూరల్: మండలంలోని మార్చాలలో మల్లికార్జున దేవాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బక్రెయాదయ్య ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, మల్లయ్య, లింగయ్య, తిరుపతయ్య, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ మల్లేష్, పుల్లారెడ్డి, బాలయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేస్తాం
కల్వకుర్తిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు అన్నారు. బుధవారం మండలంలోని ముకురాలలో కేంద్ర కమిటీ పిలుపు మేరకు ప్రజా చైతన్యం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు ప్రజలను చైతన్యం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జగన్, వెంకటయ్య, పరమేష్, చంద్రయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ
కల్వకుర్తిరూరల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బహుజన సమాజ్ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య గాయపడి పట్టణంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీనివాస్‌యాదవ్ బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అడ్వైజర్‌గా కొమ్ము కిరణ్
చారకొండ: కల్వకుర్తి నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అడ్వైజర్‌గా మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లికి చెందిన కొమ్ము కిరణ్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో ఎన్నుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవుదూడ మృతి
కొల్లాపూర్: పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఆవుదూడ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న భజరంగ్‌దళ్ నాయకులు అక్కడికి చేరుకొని పట్టణ శివారులో ఆవుదూడను ఖననం చేశారు. ఆవుదూడకు పూలమాలలతో అలంకరించి పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు పురేందర్, పులి భరత్, రమేష్, చరణ్, శ్రీకాంత్, లక్ష్మణ్, శ్రావణ్, ప్రశాంత్, మహేష్ తదితరులు ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో..

చారకొండ: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి చెందిన ఘటన మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కౌలు రైతు నర్సింహకు సంబంధించిన ఆవు గ్రామ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ రూ.90 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. పశువైద్యాధికారి శివకుమార్ ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. నమోదు చేసినట్లు తెలిపారు.

ఆర్థికసాయం
అచ్చంపేట రూరల్: మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన ప్రసాద్, అంబిక దంపతుల ఐదేళ్ల కుమార్తె ఎనెక్ష మెదడుకు సంబంధించిన వ్యాధితో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు అన్వేష్‌రెడ్డి, రిషిలు ఆస్పత్రి వద్ద రూ. 20వేలు ఆర్థికసాయం అందజేశారు.

రికార్డులు సిద్ధం
తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించిన త్వరలో నిర్వహించే సామాజిక తనిఖీలకు రికార్డులను సిద్ధం చేస్తున్నట్లు ఎంపీడీఓ గంగామోహన్ తెలిపారు. 2021, 22 సంవత్సరానికి గాను గ్రామంలో జరిగిన పనులకు సంబంధించి అన్ని రకాల రికార్డుల పనుల్లో ఉపాధి హామీ సిబ్బంది నిమగ్నమయ్యారు.

అన్ని రంగాల్లో బీఆర్‌ఎస్ విఫలం
తాడూరు: అన్ని రంగాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని బీఎస్పీ నాయకులు కొత్తపల్లి కుమార్ పృథ్వీరాజు, మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని ఇంద్రకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి పాదయాత్ర పేరుతో మరో మోసానికి తెర తీస్తున్నాడని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్తామన్నారు. నియోజకవర్గంలో ఇసుక, నల్లమట్టి, ఎర్రమట్టి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు.

మున్సిపాలిటీలకు ఆర్థిక ఊతం

నాగర్‌కర్నూల్: మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. పట్టణ ప్రగతి పేరుతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన ప్రభుత్వం ఇప్పుడు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ద్వారా వచ్చిన నిధులను సంబంధిత మున్సిపాలిటీలకే అందించాలని నిర్ణయించింది. ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు జమ చేసేందుకు మున్సిపాలిటీలు కొత్తగా తెరిచిన ఖాతాల్లో ఈ నిధులు జమకానున్నాయి. దీంతో పురపాలికల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కొరత తీరనుంది.

జిల్లాలో 50,556 దరఖాస్తులు..

అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2020లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. వ్యక్తిగతంగా ఉన్న ప్లాట్ దరఖాస్తుకు రూ.వెయ్యి, లే అవుట్ ఉంటే అన్ని ప్లాట్లకు కలిపి రూ.10 వేలు సంబంధిత యజమానులు ఆన్‌లైన్‌లో చెల్లించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల నుంచి 50,556 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన వాటిని క్లస్టర్లు, సర్వేనంబర్, కాలనీల వారీగా విభజించారు. వచ్చిన నిధులు హైదరాబాద్‌లోని ప్రత్యేక ఖాతాలో జమయ్యాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎల్‌ఆర్‌ఎస్ నిధులు సంబంధిత మున్సిపాలిటీ పరిధిలోనే ఖర్చు చేసేందుకు అవకాశం లభించింది.


నాగర్‌కర్నూల్ పట్టణ వ్యూ

మార్కెట్ ధర ఆధారంగా..

ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న 2020లో ఉన్న మార్కెట్ ధర ఆధారంగా రుసుం వసూలు చేయనున్నారు. ప్లాట్ సైజు, డాక్యుమెంట్ ఆధారంగా టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఒక్కో ప్లాట్‌కు సుమారు రూ.20 వేల నుంచి రూ.40 వేల వరకు వచ్చే అవకాశం ఉంటుంది. దీంతో ఆయా పురపాలికలకు భారీగా ధనం సమకూరనుంది. ప్రత్యేకంగా తెరిచిన బ్యాంకు ఖాతాలో జమైన నిధులను పాలకవర్గాలు తీర్మానం చేసి నిర్ణయించిన అభివృద్ధి పనులకు వెచ్చించనున్నారు.

పురపాలికల వారీగా వచ్చిన దరఖాస్తులు

పురపాలిక	దరఖాస్తులు
నాగర్‌కర్నూల్	15,995
కల్వకుర్తిలో	11,278
కొల్లాపూర్	9,200
అచ్చంపేట	14,083

ప్రత్యేక ఖాతా తెరిచాం..

ఎల్‌ఆర్‌ఎస్ నిధులు జమ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొత్త బ్యాంకు ఖాతా తెరిచాం. ఈ నిధులు జమ చేస్తే మరిన్ని అభివృద్ధి పనులకు వినియోగించే అవకాశం ఉంటుంది.
– యాదయ్య, పుర కమిషనర్, నాగర్‌కర్నూల్

విద్యార్థికి ఎస్పీ అభినందన
కందనూలు: రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించి హకీంపేట క్రీడా పాఠశాలకు ఎంపికైన విద్యార్థి అభినవ్‌ను ఎస్పీ మనోహర్ బుధవారం జిల్లా కేంద్రంలోని తన ఛాంబర్‌లో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడా పాఠశాలలో శిక్షణ తీసుకొని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. ధ్యాన్‌చంద్ ఫిజికల్ అకాడమీ కోచ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి సాయి స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైనట్లు న్యూ లిటిల్ రోజెస్ స్కూల్ ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

స్థలం కేటాయించాలని వినతి
వెల్దండ: మండల కేంద్రంలో గిరిజనుల ఆరాధ్యదైవమైన సేవాలాల్ మహరాజ్ దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని గిరిజన సంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలో అత్యధికంగా గిరిజన తండాలు ఉన్నాయని వివరించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జైపాల్‌నాయక్, గోపాల్‌నాయక్, సురేష్‌నాయక్, తారాసింగ్, లక్ష్మణ్‌నాయక్, నర్సింగ్‌నాయక్, తదితరులు ఉన్నారు.

హామీలు అమలు చేయాలి


నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మంతటి గ్రామాన్ని సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు, తిరుపతయ్య, వెంకటయ్య, నాగులు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయ వృత్తి విలువైనది
కల్వకుర్తి టౌన్: పాత్రికేయ వృత్తి సమాజంలో చాలా విలువైనదని మిత్ర ఫౌండేషన్ సభ్యులు అన్నారు. బుధవారం పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్‌హాల్‌లో జర్నలిస్టు డే నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన జర్నలిస్టులను సన్మానించారు. కార్యక్రమంలో విలేకరులు, మిత్ర ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వాసవీ క్లబ్ భవనంలో క్లబ్ వ్యవస్థాపకుడు కల్వకుంట్ల చంద్రసేన్‌గుప్త జయంతి వారోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం వారోత్సవాలలో భాగంగా జర్నలిస్ట్ డేను నిర్వహించారు. స్థానిక జర్నలిస్టులను సన్మానించారు. ఈ సందర్భంగా వాసవీక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ సేవలో జర్నలిస్టులు ముందుండాలని కోరారు. కార్యక్రమంలో రమేష్, శంకర్, మనోహర్, సత్యం, కొండూరు కృష్ణయ్య, శ్రీలక్ష్మి, ఆంజనేయులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు యూనిఫామ్స్ వితరణ
పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో బుధవారం ఎస్‌జీఎఫ్ కబడ్డీ క్రీడలకు ఎంపికైన బాలికలకు యూనిఫామ్స్‌ను ఎంపీటీసీ రేణుక, నాగరాజు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో నాగరాజు, హెచ్‌ఎం మద్దిలేటి, కోచ్ శివకుమార్ పాల్గొన్నారు.

వంటపాత్రలు..

పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్ల ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ వంట పాత్రలను వితరణ చేశాడు. ఈ మేరకు బుధవారం ప్రధానోపాధ్యాయుడు జాకీర్‌పాషాకు అందించారు. కార్యక్రమంలో విష్ణు, ప్రవీన్, అనూష, శంకర్, కృష్ణయ్యగౌడ్, ఆసీఫ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి
నాగర్‌కర్నూల్‌రూరల్: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం శిశుసంక్షేమ శాఖ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పొదిలరామయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మెకు సన్నద్ధం అవుతున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటమ్మ, జయమ్మ, సుగుమ్మ, చంద్రకళ, అలివేల, అనురాధ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల ధర్నా


నాగర్‌కర్నూల్‌రూరల్: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా పాత కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న ధర్నాకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య, యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం
అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లిలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మన్ననూర్ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ జాన్సన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత
తెలకపల్లి: మండలంలోని పెద్దూరు గ్రామానికి చెందిన రాములు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.2.50లక్షల మంజూరయ్యాయి. దీంతో హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బాధితుడికి బుధవారం మర్రి జనార్దన్‌రెడ్డి ఎల్‌ఓసీ అందజేశారు. కార్యక్రమంలో ఈదుల నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ
తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన అంకూరి శంకర్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి బుధవారం బాధితుడిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, నాయకులు ప్రకాష్, బాలరాజు, లక్ష్మయ్య, బాండారి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ అభివృద్ధికి విరాళం


కోడేరు: మండల కేంద్రంలో పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం రూ.25 వేలు, ఖానాపూర్ పోచమ్మ దేవాలయ అభివృద్ధికి రూ.10 వేలు సింగిల్ విండో డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి బుధవారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఖానాపూర్ కుర్మయ్య, రాంలక్ష్మణ్, నిరంజన్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పోటాపోటీ ప్రచారం
కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో బుధవారం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు గడప, గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరించారు. అంతకుముందు కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీనరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి తల్లి బిచ్చమ్మ సింగోటంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లక్ష్మీనరసంహ్మా స్వామి ఆలయం పునర్నిర్మాణం కోసం ఎమ్మెల్యే రూ.15 కోట్లు మంజూరు చేయించారన్నారు. రూ.కోటితో శ్రీవారి సముద్రం అలుగు పునర్నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సింగల్‌విండో చైర్మన్‌ చింతకుంట శ్రీనివాసులు, ఉపసర్పంచ్ సత్యం, గిరి, కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ వెంకటస్వామి, రామచంద్రరెడ్డి, నరసింహ్మారావు, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.తదితర నాయకులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులను ఆదుకుంటాం

అచ్చంపేట రూరల్: మెప్మా ద్వారా వీధి వ్యాపారులను గుర్తించి వారికి రుణాలు ఇచ్చి ఆదుకుంటామని మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ ఆఫీసు భవనంలో వీధి వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు చట్టబద్ధత గుర్తింపునిచ్చి వారు వ్యాపారం చేసుకోవటంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరిరాజు, కౌన్సిలర్లు రమేష్ రావు, రమేష్, ఏపీజీవీబీ బ్యాంకు సిబ్బంది, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి ఎల్‌ఐసీ తోడ్పాటు

అచ్చంపేట: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎన్నో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతోపాటు పంచవర్ష ప్రణాళికల్లో దేశ పురోగాభివృద్ధి తోడ్పాటునందిస్తుందని మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహ్మగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక ఎల్‌ఐసీ శాటిలైట్ బ్రాంచిలో నిర్వహించిన బీమా వారోత్సవాల ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1956లో స్థాపించబడిన ప్రభుత్వరంగ సంస్థ ఎల్‌ఐసీ ఇప్పటి వరకు కోట్లాది కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుందన్నారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. డీఓలను, సీనియర్ ఏజెంట్లు జగదీశ్వర్‌రెడ్డి, కర్ణస్వామిలను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బ్రాంచి మేనేజర్ వెంకన్న, ఏఓ చంద్రశేఖర్, డీఓలు వీరేశం, ప్రదీప్, నిరంజన్, శ్రీనివాసులు, లియాఫీ నాయకులు చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, ఏజెంట్లు పాల్గొన్నారు.


ఎల్‌ఐసీ ఏజెంటును సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ నర్సింహ్మగౌడ్, బీఎం తదితరులు

ఘనంగా బోనాలు


వెల్దండ: మండల కేంద్రంలో బోనాల పండుగ సందర్భంగా మహిళల సందడి కనిపించింది. మహిళలు బోనాలతో పోచమ్మ ఆలయానికి ఊరేగింపుగా వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూపతి రెడ్డి, జాతీయ బీసీ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి, కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

గ్రామ కమిటీల ఎన్నిక
కొల్లాపూర్ రూరల్: మండలంలోని ముక్కిడిగుండం, సోమశిల, రామపురం, మొలచింతలపల్లి, వరిదేల, ఎర్రగట్టు బొల్లరం, నార్లాపూర్ గ్రామాలలో బుధవారం దండోరా గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దండోరా జిల్లా నాయకులు ఏదుల రాముడు, సింగోరం రాముడు మాదిగల ఆధ్వర్యంలో కమిటీలను ఏర్పాటు చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన
వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామం ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ నేరాలపై విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంక్ ఖాతానెంబర్, ఆధార్ నంబర్ చెప్పొద్దన్నారు. విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏఎస్ఐ శ్రీనివాసులు, వెంకటయ్య, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మహిళలకు అండగా షీటీం

తాడూరు: మహిళలకు అండగా షీటీం ఉంటుందని షీటీం జిల్లా ఇన్‌చార్జ్ విజయలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని మేడిపూర్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులకు మహిళా చట్టాలు, షీటీం ఉపయోగాలు, డయల్ 100, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధిస్తే షీటీం నెంబర్: 8712657676 ఫోన్‌చేసి తెలిపాలన్నారు. షీటీం సిబ్బంది వెంకటయ్య, వెంకట్‌నాయక్, సురేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు సహించం
అచ్చంపేట రూరల్: ప్రతిపక్ష నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే సహించమని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని 7వ, 17వ వార్డులలో రూ. 1.05కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడారు. ప్రాణం ఉన్నంత వరకు నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానన్నారు. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాలరాజు

రిమాండ్‌కు నిందితుడి తరలింపు
నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో పలు దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మహేందర్ బుధవారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం అచ్చంపేటకు చెందిన సాగర్ జిల్లా కేంద్రంలోని ఈనెల1న ఓ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో, 4వ తేదీ ఓంనగర్‌కాలనీలో రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డాడు. జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి తులం బంగారం, రూ 20వేలు నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకునట్లు పేర్కొన్నారు.



కృష్ణం వందే జగద్గురుమ్




అచ్చంపేట రూరల్: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని పలు పాఠశాలలో చిన్నారులు వేసిన గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలు ఆకట్టుకున్నాయి. అలాగే పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సాయంత్రం వేళ ఉట్లు కొట్టే కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగింది.


మన్ననూర్: శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో గ్రామ యాదవ సంఘం, మహిళల సమక్షంలో చిన్ని కృష్ణునికి ఊయల కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పుర వీధులగుండా భజన కీర్తనలు ఆలపిస్తూ ఊరేగించారు.గురువారం ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహిస్తునట్లు సర్పంచ్ శ్రీరాం పేర్కొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని పలు కాలనీలలో కృష్ణుని, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఎస్ఆర్ పాఠశాలలో గోపికలతో కోలాటం, ఉట్లు కొట్టడం కార్యక్రమం నిర్వహించారు.

బిజినేపల్లి: మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా పాఠశాల విద్యార్థులు కృష్ణుడు, గోపిక వేషధారణతో ఆకట్టుకున్నారు. కృష్ణాష్టమి ప్రాముఖ్యతను వివరించారు.


తెలకపల్లిలో..


అచ్చంపేటలో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు


మన్ననూరులో..


తాడూరులో..